

# మచ్చ తొలగింది

కొలకలూరి

హోటల్‌లో బిల్లు చెల్లిస్తూ కని పించాడు శేషగిరి. చూడనట్లుగా, అతను ఎవరో తనెరుగనట్లుగా వూరుకొన్నాడు గోపీకృష్ణ.

మెట్లు దిగుతుంటే ఎదురయ్యాడు గోపీకృష్ణ. అపరిచితుల పట్ల చూపే గౌరవం మాదిరిగా ప్రక్కకు తప్పుకొని, చూసీ చూడనట్లు వెళ్ళిపోయాడు శేషగిరి.

'ఏ ఫ్రెండ్' అన్నారు మిత్రుల గోపీతోనూ, గిరితోనూ.

ఇద్దరిలో ఎవరూ ఏ సమాధానమూ చెప్పలేదు తోటి మిత్రులతో గోపీ హోటల్‌లోకీ, గిరి రోడ్డు మీదికీ వెళ్ళిపోయారు.

కాఫీ ఆర్డరు చేసి, స్నేహితుడు అడి గాడు

'ఏమిటి సంగతి?'

గోపీ మౌనం వహించాడు.

'అసలేం జరిగింది?'

సమాధానం లేదు.

'చెడిందా?'

జవాబు చెప్పలేదు.

కాఫీ పూర్తయింది. అందరూ కాలే జీకి వచ్చి, ఎవరి రూంకు వాళ్ళు వెళ్ళి పోయారు.

* * *

మూడేళ్ళ క్రిందట గోపీ, గిరీ, ఇద్దరూ ఒకే రోజు ఆ కాలేజీలో లెక్చరర్స్‌గా చేరారు. ఎం.ఏ పూర్తి అయి, ఉద్యోగా లలో చేరేనాటికి ఇద్దరిలో ఎవరికీ పెళ్ళి కాలేదు

ఇద్దరికీ పరిచయం మొదటి సారి అద్దెగది దగ్గరే అయింది ఒకగది ఖాళీగా వుందని ఎవరో చెబితే చూడటం కోసం గోపీ వెళ్ళాడు. ఆ గదే చూడటానికి గిరి కూడా వచ్చాడు.

గది పెద్దది డాబా మీద వుంది. రెండు ప్రక్కల వరండా వుంది క్రింద ఇంటి యజమాని కుటుంబం వుంది. వసతులన్నీ బాగానే వున్నాయి. అయితే అద్దె ఎక్కువగా వుంది.

అంత అద్దెతో ఆ గదిలో చేరటానికి వాళ్ళిద్దరిలో ఎవరికీ ఇష్టం కలుగలేదు.

'మీరు చేరుతారా?' అంటే 'మీరు చేరుతారా?' అనుకొని 'మనం చేరు దామా?' అంటే 'మనం చేరుదాం!' అని నిశ్చయానికి వచ్చి, ఇద్దరూ ఆరోజే ఆ గదిలో చేరారు.

రెండున్నర సంవత్సరాలు ఇద్దరూ ప్రాణ స్నేహితులులాగా ఆ గదిలోనే వున్నారు శేషగిరికి ఆర్నెల్ల క్రితం పెళ్ళి కాకపోతే వాళ్ళిద్దరూ విడిపోయి వుండే వాళ్ళు కారు. మూణ్నెల్ల క్రితం గది ఖాళీ చేసి సెలవులకు స్వగ్రామం వెళ్ళి, మళ్ళీ వచ్చి వేరేగది చూచుకొన్నాడు గోపీ.

గిరి పెళ్ళికి గోపి రెండొందలు ఖర్చు చేసుకొన్నాడు అయిదు రోజులు కాలేజీకి సెలవు పెట్టాడు పెళ్ళికి ముందు రెండు రోజులు, ఆ తర్వాత రెండురోజులు స్నేహితుడితోనే వున్నాడు.

పెళ్ళి అయ్యాక విజయ ఎలావుందిరా అని ప్రశ్నిస్తే 'చాలా బాగుంది! శిల్పం వంటి అందం! బంగారం వంటి రంగు. అయస్కాంతం వంటి ఆకర్షణ' అని చెప్పాడు గోపీ.

'నాకింత అందమైన భార్య వస్తుందని నువ్వు కలలో అయినా అనుకొన్నావా?'

'అనుకోలేదు విధి విచిత్రత మన కర్థంకాదు. నిన్ను పెళ్ళాడటానికి ఏ అమ్మాయి ఒప్పుకొంటుందా అని చాలా కాలం ఆలోచించాను. భయపడ్డాను కూడా. కాని నాభయం తప్పు అని గుర్తించాను నువ్వు అదృష్టవంతుడివి, నా సరళ లాగా వుంది నీ భార్య!'

గిరి నవ్వి 'అదృష్టం సంగతి అలా వుంచు. మరి నీ పెళ్ళి ఎప్పుడూ? త్వరగా తేల్చి పారెయ్'.

'ఎవర్ని పెళ్ళాడాలో నిశ్చయించుకో లేకుండా వున్నాను. చూద్దాం!' గోపీ ఏమాత్రం ఉత్సాహం లేకుండా చెప్పాడు.

గిరి అందంగా వుండడు. నల్లగా వికారంగా వుంటాడు. నాగరికత నేర్పిన అలంకరణ కారణంగా గిరిని చూచి సహించుకో వచ్చు గానీ, లేకపోతే పొట్టిగా గుండ్రంగా ఎగుడు దిగుడు ముఖంతో వుండే గిరి అసహ్యంగానే వుంటాడు.

గోపీ అందంగా వుంటాడు పట్టుకొంటే మురికి అయిపోతుందేమో నన్నంత బంగారు ఛాయ శరీరం నిండు విగ్రహం. ముఖంలో గానీ, అవయవాలలో గానీ ఏమాత్రం లోపం లేదు పైపెచ్చు ఆకర్షణవుంది. ఆ ఆకర్షణ ఏమిటీ అంటే ఇదమిత్థంగా ఏమీ చెప్పటానికి వీలులేదు అందరికి వున్నట్టే అతనికీ కళ్ళూ, ముక్కూ, చెక్కిళ్ళు వున్నాయి అయితే అందరిలో అరుదుగా వుండే అందం అతనికి వుంది. కళ్ళు మాత్రం ప్రశ్నించినట్టు వుంటాయి.

గోపీకి పెళ్ళంటే ఎందుకో భయం! స్త్రీలంటే భయంకాదు. ప్రేమంటే భయంలేదు. ఎందరినో స్త్రీలను అతను ప్రేమించాడు అంతకంటే ఎక్కువగా ఎందరో అతన్ని ప్రేమించారు

అతను జవాబు వ్రాయక పోయినా కనీసం వారానికొక ఉత్తరం వ్రాసేవాళ్ళు నలుగురు అయిదుగురు అమ్మాయిలు వున్నారు. ఒకటి రెండు ఉత్తరాలు వ్రాసి వూరుకొని, పెళ్ళి చేసుకొని, కాపురాలు చేసుకొంటున్న స్త్రీలూ చాలా మంది వున్నారు. అప్పుడప్పుడూ అతనూ చాలా మందికి ఉత్తరాలు వ్రాస్తూ వుంటాడు.

గోపీ ఎప్పుడూ ఒక అమ్మాయిని తలుచు కొంటూ వుంటాడు. ధ్యానిస్తాడంటేనే సబబుగా వుంటుంది. ఉత్తరం వ్రాయడు. ఆమె చని పోయింది. పేరు సరళ!

భూమ్మీదున్న వాళ్ళు సరళ సౌందర్యం చూచి తట్టుకోలేరని దేవుడామెను చంపి వేశాడంటూ గిరితో ఎన్నోసార్లు చెప్పాడు గోపీ.

ప్రేమ లేఖలు, కామలేఖలు, విరహ లేఖలు, విరసలేఖలు, ప్రారంభ లేఖలు, సమాప్త లేఖలు గోపీ లెటర్స్ ఫైల్‌లో చాలా వున్నాయి. అతనే ఉత్తరాన్ని చింపి వేయడు, కాల్చి వేయడు, నాశనంచేయడు.

ఆ ఫైల్‌లోనే ఫొటోలు కూడా వున్నాయి అవి యస్సెల్సీ అమ్మాయి మొదలుకొని ఎమ్మే అమ్మాయిలూ, నర్సులు మొదలుకొని డాక్టర్లూ, అవి వాహితలూ, వివాహితలూ చాలా మందివి.

'వీళ్ళతో నీకు సంబంధం వుందా?' అని గిరి ఒకసారి ప్రశ్నించాడు.

లేదనే గోపీ సమాధానం కాని గిరి ఆ జవాబు నమ్మ లేదు.

గోపీకి దాపరికం లేదు అతని ఉత్తరాలు అన్నీ గిరి చదివి, లేఖలు వ్రాయటం. నేర్చుకున్నాడు గిరి చదవక పోతే, గోపీ చదివి వినిపించే వాడు

గోపీకి వాగుడెక్కువ వస పిట్టలాగా వస! పెళ్ళి పందిట్లో మైక్‌లాగా పాత పాటలే పాడుతూ వుంటాడు. గిరి క్లాసులో ఎట్లా మాట్లాడుతూ వుంటాడో గానీ, నోరు ఎత్తడు. ఎంత పాత సంగతి అయినా చెబుతుంటే వింటూనే వుంటాడు రాత్రి రెండయినా, మూడయినా— ఎంతకాలం గడిచిందో తెలియకుండా, గోపీ చెబుతూ వుంటాడు. గిరి వింటూ వుంటాడు.

ఇవాళ ఆ ప్రహరీ వెనుక నుంచి ఆమె నవ్విందనో, ఎదురయిన ఆమె మెలికలు తిరిగి పోయిందనో ఏదో ఒక సంఘటన చెప్పకుండా గోపీ వూరుకోడు. గిరి వినకుండా వూరుకోడు.

వెళితే కాలేజీకి లేకపోతే గది చెప్పు కుంటే కబుర్లు. లేకపోతే వ్రాసుకోవటం, అంతకంటే మరొక స్థితిలో సాధారణంగా గోపీ కనిపించడు.

అతను కథలూ, నవలలు చాలా వ్రాశాడు. చాలా ప్రచురిత మయ్యాయి. రచయిత అని గోపీ మీద గిరికి అభిమానం లేదు. 'తెలుగు చదువుకొన్నావ్. వ్రాస్తున్నావ్ గొప్పేమిటి?' అంటాడు.

అభిమానానికీ ఆదరణకీ కారణం స్నేహమే! అయితే స్నేహితుడి రచనలు అది మంచి ఆ రోజుదాకా వ్రాసినవి అన్నీ చదివాడు గిరి.

'నాకేం అనుభవం లేదంటావే, మరి శృంగారం అంత బాగా, జీవితంలో పండి పోయిన వాడిలాగా ఎలా వ్రాయగలవూ?' అని గిరి ఒక రోజు ప్రశ్నించాడు.

'లోకంలో పెళ్ళయి ఎంతో మంది వున్నారే అందరూ వ్రాయరేం?' ఎదురు ప్రశ్న వేశాడు గోపీ!

'తీరిక లేక!'

ఆ తర్వాత వాళ్ళు ఎప్పుడూ ఆ విషయం గూర్చి మాట్లాడుకోలేదు. గోపీ వ్రాయటం మానుకోలేదు. గిరి చదవటం ఆపుకోలేదు.

గిరి చదువంతా వున్న వూళ్ళోనే ముగిసింది అమ్మ వండి పెట్టిన అన్నం తప్ప హోటల్‌లో ఎప్పుడూ భోజనం చేయలేదు గోపీ యస్సెల్సీ నుంచి, సెలవుల్లో తప్ప యింటివద్ద భోజనం చేయలేదు హాస్టళ్ళూ, హోటళ్ళూ బాగా అలవాటే!

లెక్చెరర్‌గా చేరిన వారం రోజుల్లోనే హోటల్ భోజనం పరిపడక నానా అవస్థ పడ్డాడు శేషగిరి రూంమేట్ కోసం తనూ హోటల్ మానుకొన్నాడు గోపీ. చేయి కాల్చుకోవటం ప్రారంభించారు. స్వయం పాకం పాకాన పడిందాకా వాళ్ళు పడిన పాట్లు ఒకటా రెండా? కోట్లు!

కొద్దో గొప్పో రుచిగా భోజనం చేసుకోవటం మొదలయిం తర్వాత గిరికి ధర్మ సందేహం వచ్చింది 'భోజనం చేసుకోవటం అలవాటు అయిందే పెళ్ళి చేసుకోవటం మరచి పోతామేమో!'

నవ్వు కొన్నారు.

సంవత్సరం బాగానే గడచి పోయింది. రెండో ఏడు వేసవి సెలవులు పూర్తయి వచ్చిన గిరి, వచ్చిన వారం రోజులకే మంచం పట్టాడు. టైఫాయిడ్! హాస్పటల్‌లో చేరాడు

ఆ రెండు వారాలూ, గిరికి గోపీ పని మనిషిలాగా, భార్యలాగా, అమ్మలాగా సేవ చేశాడు. హాస్పటల్ నుంచి తిరిగి వచ్చిం తర్వాత ఆ సంవత్సరం అంతా గోపీ గిరికి వంటపని చేశాడు

వాళ్ళిద్దరు ఎంతో చేరువ అయ్యారు. అన్నాదమ్ములు గానీ, తండ్రీ కొడుకుగానీ, మరి ఏ ఇద్దరు యువకులూ అంత ఆత్మీయులు కాలేరు ఒకరిని విడిచి ఒకరు ఉండే వాళ్ళే కాదు

మరి మూడేళ్ళు కలపి మెలసి ఉన్న

వాళ్ళు ఎందుకు అపరిచితులు మాదిరిగా అయి పోయారు? అవేది సమాధానం చిక్కని ప్రశ్న!

పెళ్లయిన వెంటనే కాపురం పెట్టాడు గిరి. ఫేమిలీ పోర్షన్ కోసం వాళ్లిద్దరూ కలిసి తిరిగారు. సంపాదించారు.

విజయ వచ్చాక మిత్రుడు వేరయ్యాడు. వేరే కాపురం పెట్టాడు. ఇక రాత్రుళ్ళు కలసి మాట్లాడు కోటానికి వీలులేదు. గోపీ ఒంటరి వాడయి పోయాడు ఇంత కాలంగా సాగి వచ్చిన స్నేహలత క్షణంలో తుంచుకొని వెళ్లి పోయాడు. గిరికి ఆ బాధలేదు. భార్య వుంది. వాళ్ళు ఆనందంగానే వుంటారు.

గోపీ అన్నం వండుకోవటం మాని వేశాడు. హోటల్ భోజనం. ఒంటరి

# మంచు తొలగింది

జీవితం భరించలేక పోతున్నాడు. తనూ పెళ్లి చేసుకోవాలని ఆలోచన వస్తే గుండెల నిండా భయం!

'గోపీ! మా యింటికి రావేం నువ్వు?' అని ప్రశ్నించేవాడు వేరయి పోయిన గోపీని తలుచుకొని కుమిలి పోయేవాడు. ఒక్కొక్కసారి విజయ మీద విపరీతంగా కోపం కూడా వచ్చేది.

'మాయింటికి రేపురా!' అని ఎన్నో సార్లు గిరి చెప్పాడు. గోపీ పోలేదు. 'మా యిల్లట మా యిల్లు! ఇంతలోనే పేడికొక ఇల్లు' అనుకునేవాడు

'మా యింటికి పోదాంరా!' రెండు సార్లు వెంట బెట్టి తీసుకు పోయాడు. టిఫిన్ తెచ్చి పెట్టాడు. కాఫీ ఇచ్చాడు. కులాసాగా కబుర్లు చెప్పుకున్నారు

ఒకరోజు కాలేజీ అయింతర్వాత, మిత్రు లిద్దరూ హోటల్‌లో కాఫీ త్రాగి బయలు దేరారు.

'గోపీ! నీగది కొస్తాను'

'నా గదేమిటి? మనగది అనలేవూ? ఎందుకు నన్ను పరాయి వాణ్ణి పలక రించినట్టు పలకరిస్తావు?'

ఇద్దరూ రూంకు వచ్చారు చాలాసేపు ఏవేమో మాట్లాడు కున్నారు. చాలా కాలానికి మాట్లాడుకునే అవకాశం కలి గింది.

'నీ పుస్తకాలు, రచనలు అన్నీ ఇవ్వు!'

'ఎందుకు గిరి!'

'ఎందుకో నీ కనవసరం! ఇవ్వమన్నాను. ఇవ్వు!'

ఇస్తూ 'ఇందులో కొన్నిటికి రెండో కాపీ లేదు. భద్రంగా ఇవ్వాలి మళ్లీ అని చెప్పాడు.

'అలాగే లే!'

గిరి తీసుకొని వెళ్లిపోయాడు.

వారం రోజుల్లో రూంకు తీసుకువచ్చి ఇచ్చాడు.

'ఎవరు చదివారు? మీ ఆవిడా? ఎలా వుంది నా రచనా వ్యాసంగం మీ ఆవిడ దృష్టిలో?'

గిరి ఏమీ చెప్పలేదు మాట్లాడకుండా మెట్లు దిగి వెళ్లిపోయాడు. గోపీ చిత్తైర పోయాడు.

ఆపైన వారం రోజులు మామూలు గానే గడచిపోయాయి. ఆతర్వాత కాలేజీకి సెలవులు ఇచ్చారు. గిరి కుటుంబంతో వెళ్లిపోయాడు

వెళ్లేరోజు రైలు దగ్గరకు పోలేకపోయాడు. సెలవుల్లో మూడు ఉత్త రాలు వ్రాశాడు ఒక్కదానికీ జవాబు రాలేదు.

భార్య వచ్చాక గిరి నన్ను మరచి పోయాడు. అనుకొని బాధపడ్డాడు గోపీ!

సెలవులు పూర్తయి, ఒకరోజు ముందు గానేవచ్చి, అద్దెగది చూచుకోవటంలో గిరి ఇంటికిపోలేదు. కాలేజీలో ఎంతవెదికినా కనిపించలేదు, గిరి.

'నేను ఎప్పుడూ ఇంటికి రాలేదని వాడికి కోపం కాబోలు' అనుకొని, ఆ సాయంకాలం వెళ్లాడు. గిరి ఇంట్లోనే వున్నాడని తెలుసు.



ఇంగ్లీష్ టెరిలిన్



పాంట్ & షర్టుకు గుడ్డలు
(1.25 & 2.15 మీటర్లు)
రెండు కలిసి క్లియరెన్సు అమ్మ
కము రు. 25/- రెండు సెట్లు
(2.50 & 4.30 మీటర్లు)
రు. 48/- ఇంగ్లీష్ టెరిలిన్
సూటు పొడుగు (3 మీటర్లు)
రు. 40/- వి.పి.పి. చార్జీలు రు. 2-50
ARVIND AGENCIES (WAPT-25(
Box 1408, Delhi-6.

3 వేలలు ఉచిత బహుమతి.



అందమైన స్త్రీలకు మిక్కిలి
మాతనమైన ఆకర్షణీయ
మైనడిజైనులలో రంగులలో
పరిక్రొత్త కాశ్మీర్ ఆర్ట్ చీరెలు
వచ్చియున్నవి. పెద్ద సైజులలో
మాత్రమే లభించును. 1
డిలక్స్-చీర రు. 11/-2కి
రు.20/- 3కిరు.28/-4కు
రు.36/- రెండు లేక అంతకు
పై చీరెలకు ఆర్డరు పంపిన
వారికి బ్లౌజు గుడ్డ ఉచితం మీ ఆర్డరును
పోస్టు పార్సిల్ ద్వారా పంపబడును.
ARVIND AGENCIES (WAP-22)
P. B. 1408, Delhi 6

పుస్తకములు

5 పుస్తకముల సెట్టు రు. 5-50.
(1) కొక్కోకశాస్త్రం (2) సుహాగాత్
(3) చుంబన పద్ధతులు, (4) 84 ఆసన
ములు, (5) రహస్యఫోటో ఆల్బం. ఒక్కొక్క
పుస్తకం రు. 2/-. పోస్టేజి, ప్యాకింగ్
అదనం. ఇంగ్లీషులో వ్రాయండి.
SULEKHA TRADERS,
WAT-7) Beat No. 13, Aligarh.

ఫోల్డింగ్ 50 షాట్ పిస్టల్

లైసెన్సు అక్కరలేదు. అమెరికన్ మోడల్. దొంగలు,
క్రూరమృగముల నుండి రక్షించుకోండి. ఉల్లాస
ప్రయాణాలు, యాత్రలు, నాటకాలకు ప్రశస్త
మైనది. ఆటోమేటిక్




50 షాట్లు ఏర్పాటు
గలదు తేలికైనది. ఇందు
నుండి వెలువడు నిప్పు
రవ్వలు మిమ్మును కాపా
డును. ధర. 50 షాట్లు
జర్మన్ మోడల్ నెం. 99 రు. 15/50. వి.పి.పి.
చార్జీలు రు. 2/50 లెదర్ కేస్ రు. 3/50
అదనపు షాట్లు 100 కి రు 5/-.
SULEKHA TRADERS (WAP 15)
Beat No 13 Aligarh

# మచ్చ తొలగింది

పిలిచాడు.

సమాధానంలేదు.

మళ్లీ పిలిచాడు.

పనిమనిషివచ్చి చెప్పింది. 'అయ్యగారు ఇంట్లోలేరు!'

అంతవరకు ఎప్పుడూ గోపీపోలేదు గిరి యింటికి. తీరా వెళితే ఇంట్లోవుండే అలా చెప్పించాడు.

'ఏమిటిదంతా? ఎందు కిలా అయి పోయాడు? నేనేం తప్పు చేశాను?'

గోపీ కుమిలిపోయాడు. కారణం తెలి యక పిచ్చివాడయిపోయాడు. గిరిని చూడందే, మాట్లాడందే గోపీ ఉండలేడు. ప్రయత్నిస్తే ఎలా ఉంటుందోగానీ, పలక రించినా పలకరించకపోయినా, చూచి నప్పుడు గిరి కనీసం నవ్వకపోతే తను జీవించ లేననుకొన్నాడు గోపీ!

ఒకరోజు వరండాలో ఎదురయి ముఖం తప్పించి వెళ్లిపోయాడు గిరి కృంగి పోయాడు గోపీ!

లైబ్రరీలో పుస్తకాలు తీసుకొంటూ కనిపిస్తే 'ఏమిటి నువ్వు నాతో మాట్లా డవు ఉత్తరాలకు జవాబు వ్రాయలేదు ఇంటికివస్తే ఉండికూడా లేడని చెప్పించావు ఏమిటిది?' అని ప్రశ్నించాడు

'ఏంలేదు గోపీ!'

గిరి వెళ్లిపోయాడు

గిరి రూంకుపోయి 'అసలు సంగతేంటో చెప్పు! నీకు పుణ్యం వుంటుంది నన్నెం దుకు చంపుకుతింటావు' అని అడిగితే 'నాకు క్లాసుంది' అని వెళ్లిపోయాడు

గిరి ముఖభావం అర్థంకాలేదు. ఎంత ఆలోచించినా అంతుబట్టక తల్లడిల్లి పోయాడు. ఆత్మీయుడైన మిత్రుడు వేరై పోవటం సహింపలేకపోయాడు

సాయంకాలం కాలేజీ వదిలాక గిరి వెళు తుంటే అతను వెళ్లి, 'ఏమిటి నీ ప్రవ ర్తన?' ప్రశ్నించాడు.

'ఏమీలేదు!'

'నాతో సరిగ్గా మాట్లాడవేం?'

'మనకేం సంగతులున్నాయి మాట్లాడు కోవటానికి!'

'అంతేనా గిరి!'

'అంతకంటే ఏముంది?'

'నిజంగా అంతేనట్రా!'

బాధతో ఉడికిపోతున్నాడు. గొంతు గాద్గ దికమయింది. దాదాపు ఏడ్చినట్లుంది మాట!

'నిజంగా అంతేరా! నీకు పుణ్యంవుంటుంది నాతో మాట్లాడవద్దురా!'

గోపీ నిలువునా నీరసించిపోయాడు.

'సరే! సరేరా గిరి! సరేలే!'

నీరసంగా, బాధగా, అయోమయంగా, దిగులుగా వెళ్లిపోయాడు.

ఆరాత్రంతా నిద్ర పట్టలేదు నిద్రకు దూరమయి, ఒంటరిగా గదిలో అంతు తేలని సమస్యలతో సతమతమయి పోయాడు.

ఆనాటినుంచి ఎవరు ఎవరికి ఎదు రయినా తలవంచుకొని వెళిపోతున్నారు. కాలేజీలోగానీ, బైటగానీ, ఎప్పుడూ కలు సుకోలేదు.

నెలరోజులు తర్వాత ఒకరోజు అకస్మా త్తుగా గిరివచ్చాడు రాక సంతోషం కలి గింది. ఆనందంతో పరవశించిపోయాడు.

ఎప్పుడూ ఎక్కువగా మాట్లాడని గిరి ఆరోజు వసపిట్టలాగా వాగాడు ఎంతో ఆత్మీయంగా మాట్లాడాడు గోపీ విపరీత మైన సంతోషంతో బాధపడుతున్నాడు. ఇంతకాలం గిరి ప్రవర్తన కారణంఏమిటో తెలుసుకోవాలనుకొన్నాడు అయితే ఏమీ మాట్లాడకుండా మూగవాడులాగా కూర్చు న్నాడు.

వెళ్లిపోతూ, 'సాయంకాలం మాయింటి కిరా' అన్నాడు గిరి.

'ఎందుకు?'

'మా ఆవిడ బర్త్ డే! తీసుకురమ్మంది.'

'సరే!'

'వస్తావుగదూ!'

'చూద్దాం!'

'చూద్దాంకాదు! రావాలి తప్పకరావాలి! నీ కోసం ఎదురుచూస్తూవుంటాను'

గిరి వెళ్లిపోయాడు. ఫస్ట్ షోకి సినీ మాకి వెళ్లిపోయాడు గోపీ కాలేజీ అయిం తర్వాత రూంకయినా పోకుండా, ఆ సాయం కాలం

బర్త్ డే పార్టీకి పోవటం ఇష్టంలేదు.

ఆతర్వాత వారం రోజుల్లో ఎప్పుడయినా గిరి ఎదురయితే తప్పుకొని వెళిపోతున్నాడు గోపీ! పలకరించబోయినా పలకటంలేదు.

షాపులో బట్టలు కొనుక్కొంటూ వుంటే విజయతోపాటు వచ్చాడు గిరి.

'ఏరా పార్టీకి రాలేదు'

'రాలేదురా!'

'రాలేదు. నిజమే! ఎందుకురాలేదు?'

'కొంచెం పనివుండి'

విజయ ఏమో — మాట్లాడబోయింది!

గొప్ప కొన్ని బిట్టుల పార్శిల్ తీసుకొని నిలబడకుండా వెనుదిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

ఒకరోజు గిరి భార్యతో సినిమాకి వెళుతూవున్నాడు.

రోడ్డుమీద గోపీ కనిపించాడు.

'మీ గోపీ ఆయనేనా?' భర్తను విజయ అడిగింది.

'అవును!'

'పిలవండి!'

'పిలుస్తాను!'

గోపీ ఈ సంభాషణ అంతా విన్నాడు

'గోపీ!' గిరి పిలిచాడు. గోపీ వాళ్ళిద్దర్నీ చూచి, తల తిప్పుకొని, ఆగకుండా వెళ్ళిపోయాడు.

తెల్లారింతర్వాత కాలేజీలో కలిసి, నిగ్గదీసి అడిగాను. 'ఏమిరా నిన్న పిలుస్తున్నా వినిపించుకోకుండా పారిపోయావూ?'

గోపీ సమాధానం చెప్పలేదు. ఇద్దరూ హోటల్‌కిపోయారు. కాఫీ తాగారు. సినిమాకి పోయారా రాత్రి. గిరి ఇంటికీ, గోపీ గదికీ వెళ్ళిపోయారు.

ఇద్దరి మనస్సులోనూ ఈమధ్యమచ్చలు ఏర్పడ్డాయి వాళ్ళవి తొలగించుకోలేదు. అయినా మిత్రులు మాదిరిగానే వుంటు న్నారు.

పగలంతా కలసివుంటూరు. రాత్రి వేరవుతారు. ఎప్పుడూ గోపీ, వాళ్ళింటికి పోలేదు.

ఆ సంవత్సరం అంతా వాళ్ళు స్నేహితులే! పూర్వంలాగా స్నేహితులుకారు స్నేహంలో అరమరికలు లేకపోలేదు

సరళవంటి అమ్మాయి కనిపించేసరికి, అందరినీ కాదని ఆమెను పెళ్ళాడాడు గోపీ!

పెళ్ళికి భార్యతో వచ్చాడు గిరి. అయిదు రోజులున్నాడు.

'నీ భార్య నా విజయలాగుందిరా!' గిరి చెప్పాడు. 'నిజం చెప్పాలంటే అంతకంటే అందంగావుందే '

గోపీ భార్యా, విజయ మాట్లాడుకొంటూ ఉన్నారు. వాళ్ళిద్దర్నీ చూచిన వాళ్ళు అక్కా చెల్లెళ్ళు అనుకొనే అవకాశం వుంది.

గిరి ఆమధ్య ముభావంగా ఉండటానికి కారణం గోపీకి ఆరోజు అర్థమయింది. ఇక అంతుపట్టని విషయమేమీలేదు.

కళంకం తొలిగిపోయిన చందమామలాంటి స్వచ్ఛమైన రెండు హృదయాలు పరిపూర్ణానందంతో ఆరోజునవ్వుకొన్నాయి.


చంటిపాపలకు,
చిన్న బిడ్డలకు
కడుపునొప్పి పోగొట్టును
బెంగాల్
కెమికల్స్
గ్రైప్
మిక్చర్

తేలికగా విరేచనమయ్యే
మందులు గలిగి,
పాపలకు, బిడ్డలకు
అజీర్ణశక్తిలోపముల నివ
రించును ఆరోగ్య
హానికరము లేవియు
ఇందులో లేవు
బెంగాల్
కెమికల్


కలకత్తా * బొంబే
కాన్పూర్



ఓం! తత్! సత్!

సుఖ జీవిత సేవ
"సిద్ధవైద్యమహిమ"
సిద్ధుల సాటిలేని కీర్తికి ఒక తార్కాణము
కే. టి. కృష్ణమూర్తి ఆచ్చారి గారి
'మేల్ మాయిల్ మందు'
(Regd)
దీర్ఘకాల చర్మరోగములకు చక్కని నివారిణి
నల్లరంగు, ఎర్రరంగు పొడలు, దద్దులు, పొట్టు, గజ్జి (చర్మసంబంధము) పొడలు గల చోట్లలో తిమురు, సూదితో పొడిచినప్పుడు నొప్పి లేకుండుట, నిప్పువడి బొబ్బలు గలిగినా తెలియకుండుట, దుర్‌నీరు సర్వ అవయవములందు వ్యాపించి, రక్తములో కలిసి మత్తు కలుగజేయుట, (నరముల సంబంధము) చేతివ్రేళ్ళు ముడుచుకొనుట, బొబ్బలు లేచుట, ముక్కు బంధనములు, పాదము నందు పల్లపు పుండ్లు ఏర్పడుట, కాలుచేతులు వ్రేళ్ళు తగ్గుట, ముక్కు సొట్టపడుట, చూచుటకు వినుగు పుట్టించు రణములు (అస్థి సంబంధము) వీటికి చక్కని నివారిణి
1 మండలం (40 రోజులు) నూనె, లేహ్యము రు. 8-50 తపాల ఖర్చు రు. 2/-
8 ఔన్సుల శ్రీ పరమాత్మ తైలం రు. 3-50 తపాల ఖర్చు రు. 1-50
సిద్ధ డాక్టర్
కే. టి. కృష్ణమూర్తి ఆచ్చారి & సన్సు
5/22, మేల్ మాయిల్ PO, (N A Dt)